క్లుప్తంగా

ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): నేషనల్ హెల్త్ మిషన్ ఎన్‌హెచ్‌ఎంలో భాగంగా జిల్లాలోని రూరల్, అర్బన్ పరిధిల్లో 65 మంది ఆశా కార్యకర్తల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌ఓ జి.గీతాభాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదిలోపు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు. ప్రతిభ ఆధారముగా డిస్ట్రిక్ హెల్త్ సొసైటీ (డీహెచ్‌ఎస్) ద్వారా నియామకాలు జరుగుతాయని గీతాభాయి తెలిపారు.

పశువుల దాణా పంపిణీ

పాలకోడేరు: మండలంలో పశువులు కలిగిన రైతులకు 50 శాతం సబ్సిడీతో దాణా పంపిణీ చేస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ టి. హేమ తెలిపారు. మంగళవారం మండలంలోని పాలకోడేరు, గోరగనమూడి గ్రామాలకు చెందిన పాడి రైతులకు 50 శాతం సబ్సిడీతో కూడిన పశువుల దాణా పంపిణీ చేశారు.

క్రైస్తవులంతా శాంతిమార్గంలో పయనించాలి

భీమవరం: క్రైస్తవులంతా శాంతిమార్గంలో పయనిస్తూ ఆపదలో ఉన్నవారిపట్ల ప్రేమానురాగాలు చూపించాలని అంతర్జాతీయ క్రైస్తవ ప్రసంగీకుడు ఎస్.విజయప్రసాదరెడ్డి అన్నారు. భీమవరం పట్టణం 29వ వార్డులోని ప్రకాష్‌నగర్‌లో న్యూకమాండ్‌మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రైస్తవ రక్షణ సువార్త సభలో ఆయన మాట్లాడారు. క్రైస్తవులపై కొంతమంది కావాలని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పాస్టర్ ఇర్రింకి సతీష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గంటా సుందరకుమార్, గుండే నగేష్, బత్తుల విజయకుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు

భీమవరం: పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ మెమోరియల్ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా మంగళవారం స్వర్ణాంధ్ర అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథ పఠనం ద్వారా రీడింగ్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయన్నారు. గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, ప్రోగ్రాం కన్వీనర్ అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 6న విజేతలకు బహుమతులు ఇస్తామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఉండి: ఉండి శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి శివారు పులిగుమ్మ ప్రాంతంలో నివాసం ఉంటున్న సప్పా సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి భీమవరంలో తన కుమారుడిని తన ద్విచక్రవాహనంపై కాలేజ్‌లో దించి తిరిగి వస్తున్న సమయంలో రామాపురం టర్నింగ్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ వేగంగా ఢీ కొట్టింది. దీంతో సుబ్రహ్మణ్యం కాళ్లు, చేతులు, తలపై తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబికులు అతనిని భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతులకు బకాయిలు చెల్లించాలి

ఉండి: నెలరోజులుగా కొనుగోలు చేసిన ధాన్యానికి కూటమి ప్రభుత్వం నగదు చెల్లించలేదని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుండాబత్తుల సుబ్బారావు(హెడ్) మండిపడ్డారు. మంగళవారం ఉండిలో ఆయన మాట్లాడుతూ రైతులను నమ్మించి నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం మరోసారి వారిని దగా చేస్తుందని అన్నారు. ధాన్యం అమ్మిన 24 గంటల్లో నగదు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని చెప్పిన కూటమి నాయకులు రైతులకు ఏం సమాధానం చెబుతారు? అని ప్రశ్నించారు.

గణపతి ఆలయ వార్షికోత్సవం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం గునుపూడిలోని శ్రీవిద్యా గణపతి స్వామివారి 12వ వార్షిక మహోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. రెండు రోజులపాటు స్వామి వారికి అష్టోత్తర శతకలశ పూర్వక మహా కుంభాభిషేకము నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సీసలిలో గ్రామోత్సవం

కాళ్ల: మండలం సీసలి గ్రామ దేవత పోలేరమ్మ, పోతురాజు ఆలయ పునః నిర్మాణం దర్భంగా ఆలయంలో ప్రతిష్ఠించబోయే నూతన రాతివిగ్రహాలను మంగళవారం గ్రామోత్సవం నిర్వహించారు. సాయిబాబా ఆలయం వద్ద విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ కట్రెడ్డి శ్రీనివాసరావు, విజయలక్ష్మి, కట్రెడ్డి సురేష్ కుమార్, నూకల భోగేంద్రబాబు, తోట రామదాసు పాల్గొన్నారు.

సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు

భీమవరం: ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం భీమవరంలోని వీరమ్మ పార్క్ సమీపంలో చిన్నారులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు మాట్లాడుతూ సైకిల్ తొక్కడం వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, చాన్ బాషా, ఎస్ వెంకటేశ్వరరావు, మహమ్మద్ సరోజిని పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి

- సూపర్ సిక్స్ ఊసే లేదు
- ఏడాది పాలన పూర్తయినా సంక్షేమ పథకాలు అమలు చేయని వైనం


యనమదుర్రు డ్రయిన్‌పై అప్రోచ్‌రోడ్డులేని వంతెన దృశ్యం


తాడేరులో మునిసిపల్ డంపింగ్‌యార్డు కోసం సేకరించిన భూమి


యనమదుర్రు డ్రెయిన్‌గట్టుపై ఉన్న చెత్త

భీమవరం: అంతన్నారు... ఇంతన్నారు కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వస్తే ప్రజలకు స్వర్గం చూపిస్తామన్నారు. ఏడాదికాలం గడిచిపోతున్నా సంక్షేమంలేదు. అభివృద్ధి లేదంటూ ప్రజలు మండిపడుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఏడాది కావస్తున్న సందర్భంగా కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గుర్తు చేసుకుంటూ ఈనెల 4వ తేదిన వైఎస్సార్ సీపీ నిర్వహించే వెన్నుపోటు కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై ప్రభుత్వానికి తమ నిరసన తెలపాలని సమాయత్తమవుతున్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ జట్టుకట్టి గత ఏడాది జరిగిన ఎన్నికల్లో భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించడమేగాక వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలకంటే మరిన్ని ఎక్కువగా అమలు చేస్తామని ఎన్నికల సభలో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, స్థానిక నాయకులు చేసిన వాగ్దానాలను నెమరువేసుకుంటూ కూటమి ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం కంటే అధనం సంగతి అటుంచి అప్పట్లో అమలు చేసిన అమ్మఒడి, రైతు భరోసా, చేయూత, అసరా, కాపు నేస్తం, ఫీజురీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన వంటి అనేక పథకాలు అటకెక్కించారని అమ్మ ఒడి పథకంలో నీకు..15, నీకు...15, నీకు...15 అంటూ గొప్పగా ప్రచారం చేసిన రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చేసిన హంగామాను చర్చించుకుంటూ ఒక్కరి కూడా ఇవ్వలేదంటూ మహిళలు శాపనార్థాలు పెడుతున్నారు.

భీమవరంలో డంపింగ్ యార్డు సంగతి ఏమిటో.....

భీమవరం ఎన్నికల ప్రచారంలో సాక్షాత్తూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ భీమవరం పట్టణంలో డంపింగ్‌యార్డు తక్షణం ఏర్పాటు చేయిస్తామని, యనమదుర్రు డ్రయిన్‌పై అసంపూర్తిగా నిలిచియిన వంతెనల అప్రోచ్‌రోడ్లు నిర్మాణం చేయిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం హాయాంలోనే డంపింగ్ యార్డు కోసం అప్పటి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పట్టణం పక్కనేగల తాడేరు గ్రామం శివారులో సుమారు 6 ఎకరాల భూమిని సేకరించారు. అక్కడికి వెళ్లడానికి రోడ్డు వేయాల్సి ఉండగా ప్రభుత్వం మారడంతో డంపింగ్‌యార్డు సంగతే మర్చిపోయారు. పట్టణంలో ప్రతి రోజు సుమారు 80 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తుండగా దానికి యనమదుర్రు గట్టుపైనే డంపింగ్ చేస్తూ దానికి ప్రతి నిత్యం నిప్పు పెట్టడంతో పరిసర ప్రాంతాల ప్రజలు, డ్రెయిన్ గట్టు పక్కనగల రోడ్డుపై ప్రయాణించే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు.

వంతెనలకు అప్రోచ్ రోడ్లు సంగతి మర్చిపోయారు....

యనమదుర్రు డ్రెయిన్‌పై దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హాయాంలో నాలుగు వంతెనలు నిర్మించగా వాటికి అప్రోచ్‌రోడ్లు నిర్మాణంలో తరువాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. తరువాత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా అప్రోచ్‌రోడ్ల నిర్మాణానికి సుమారు 36 కోట్లు నిధులు మంజూరు చేశారు. అయితే సంకేతిక కారణాల వల్ల నిర్మాణంలో జాప్యం జరగగా అనంతరం అధికారంలోనికి వచ్చిన కూటమి ప్రభుత్వం అప్రోచ్‌రోడ్లు ఊచే ఎత్తడం లేదని ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. పట్టణంలో రోడ్లు నిర్మాణం అప్పట్లో జోరుగాసాగగా నేడు నత్తనడకన చేపట్టడంతో గోతులు, రాళ్లు లేచిపోయిన రోడ్లపై ప్రయాణీకులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో వైఎస్సార్ సీపీ చేపట్టిన వెన్నుపోటు దినం ద్వారా నిరసన తెలపాలని ప్రజలు నిర్ణయానికి వచ్చారు.

ఎన్నికల హామీలు గాలికే



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేస్తే ఏడాది కాలంగా ఒక్క హామీని అమలుచేయకపోవడం దారుణం. సూపర్‌సిక్స్ హామీలు గాలికి వదిలి ప్రజలను వంచనకు గురిచేశారు. హామీలను తక్షణం అమలుచేయకుంటే ప్రజలే తగిన బుద్ధిచెబుతారు.

ఇంటి సత్యనారాయణ, భీమవరం.....

ప్రచార ఆర్భాటం తప్ప ప్రజలకు ఒరిగిందేమీలేదు



కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటం తప్ప ప్రజలకు చేసిందేమి లేదు. గత ప్రభుత్వం కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఓట్లు వేయించుకుని ఉన్న పథకాలను సైతం ఊడగొట్టారు. గత ప్రభుత్వ హాయాంలో ఏదో పథకంతో ప్రతి ఇంటికి లబ్ధిచేకూరితే గత ఏడాది కాలంగా ఏ పథకం అమలు చేయకపోవడంతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ప్రభుత్వ పథకాలు లేక పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో సామాన్యుల బతుకు భారమైంది.

వంపన గోపి, భీమవరం.....

మాటల కోటలకే కూటమి పరిమితం

- చేతల్లో పని చేయని కూటమి సర్కారు
- రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజల ఇబ్బందులు

ఉండి: అది చేసేస్తారు ఇది చేస్తారు అని గంపెడాసలతో కూటమి నాయకుల వాగ్దానాలు నమ్మి ఓట్లు వేసిన ప్రజలను దిమ్మదిరిగేలా మోసగిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రం ఉండిలో ఒకవైపు రైతుల ముంచేస్తున్న అక్విడెక్టు, మరోవైపు శిధిలావస్థకు చేరుకున్న ఉండి సెంటర్‌లోని వంతెన భయపెడుతున్నాయి.ఎప్పుడు ఏం జరుగుతుందో అని వాటి నిర్మాణం కోసం రైతులు,ప్ర జలు, వాహనదారులు, ప్రయాణికులు ఇలా అందరూ ఎదురు చూపులు చూస్తూనే ఉన్నారు.కూటమి ప్రభుత్వం ఏడాది గడుస్తున్నా అందరికీ ఎదురు చూపులే మిగిలాయి గాని నిర్మాణాలు మాత్రం అత్యంత దూరంగానే నిలిచాయి. అవి క్షీణదశకు చేరుకుంటున్నా కనీసం పట్టించుకోకుండా యేడాది గడిపేశారు.

సమస్యలు ఎన్నో

ఉండి సెంటర్‌కు అతిసమీపంలో ఉండి కాలువ,బొండాడ మేజర్ డ్రెయిన్‌పై వున్న అక్విడెక్టు రైతుల పాలిట దుఖదాయనిగా మారిపోయింది.కొద్దిపాటి వర్షాలు వచ్చినా డ్రెయిన్ బిగదన్నడంతో ఎక్కడి నీరు అక్కడే నిచిపోయి పలు సందర్భాల్లో రైతులను తీవ్రంగా మంచేస్తుంది.దీంతో రైతులు అక్విడెక్టు నిర్మాణం ఎప్పుడు జరుగుతుందా అని ఆశతో ఎదురు చూస్తున్నారు. అలాగే సుమారు 60 ఏళ్ళ క్రితం కట్టిన ఉండి సెంటర్‌లో ఉండి కాలువపై కట్టిన వంతెన వాహనదారులను, ప్రయాణికులను కన్నీళ్ళు పెట్టిస్తుంది. దీనికి కారణం పీపీ(పాలకొల్లు,పామర్రు)రోడ్డు జాతీయ రహదారిగా మారిపోయి చాలా ఏళ్ళు అయినా గాని ఉండి సెంటర్ వంతెన నిర్మాణానికి మాత్రం మోక్షం లభించలేదు. జువ్వలపాలెం రోడ్డులో అతి ప్రాముఖ్యమైన కాళ్ళ మండలం కోపల్లె వద్ద బొండాడ మేజర్ డ్రెయిన్‌పై ఉన్న వంతెన కూడా నిర్మాణం చేపట్టి వాహనదారులు ప్రజల కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుకుంటున్నారు.


ఉండిలో పలు గ్రామాల రైతులను ప్రతిఏటా ముంచేస్తున్న అక్విడెక్టు


ఉండి సెంటర్‌లో శిథిలావస్థకు చేరిన జాతీయరహదారిపై వంతెన

చెప్పడం కాదు చేయాలి



నియోజకవర్గాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మాటలతో సరిపెట్టడం కాదు. చేతల్లో చూపిస్తేనే అభివృద్ధి జరుగుతుంది. ఏం చేయకపోయినా ఏదో చేస్తున్నట్లు హడావుడి చేయడం తప్ప ఇంత వరకు ఏం నిర్మాణం చేశారో? కూటమి నాయకులు ప్రజలకు చెప్పాలి. ప్రజలకు అవసరమైనవి నిర్మాణం చేస్తేనే అభివృద్ధి చేసినట్లు లెక్క.

– పీవీఆర్‌కే ఆంజనేయరాజు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు,వాండ్రం.

వాహనదారులకు ఇబ్బందులు



నియోజకవర్గ కేంద్రం ప్రధాన సెంటర్‌లో వంతెన సమస్య ఏళ్ల తరబడి పరిష్కారం కావడం లేదు. అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇవ్వడం కాదు. ఉండి సెంటర్‌లో జాతీయరహదారిపై ఉన్న వంతెన నిర్మాణానికి కృషి చేయాలి. వంతెన నిర్మాణం జరిగితేనే గాని ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాదు

– కరిమెరక శివనాగరాజు,వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు,ఉండి.

పొలాలు మునుగుతున్నాయి



ఉండి అక్విడెక్టు నిర్మాణం జరిగితేనే గాని ఉండి మండలంలోని కలిగొట్ల, ఆరేడు, పాందువ్వ, ఉప్పులూరు, కోలమూరు, ఉండి, చిలుకూరు, ఎన్నార్పీ అగ్రహారం, ఆకివీడు మండలంలోని పెదకాపవరం తదితర గ్రామాల రైతులు ముంపు నుంచి తప్పించుకోలేరు. ప్రతి సార్వా,దాళ్వా సీజన్లలో రైతులు కొద్దిపాటి వర్షానికే ముంపుబారిన పడుతున్నాయి. అక్విడెక్టు నిర్మాణం చేపట్టి రైతులను ఆదుకోవాలి.

– అంగర రాంబాబు,వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు,ఉండి.

హామీలు అమలుచేయని కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెబుతారు


భీమవరం 9వ వార్డు సచివాలయ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: తెలుగుదేశం, కూటమిపార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం భీమవరం 9వ వార్డు సచివాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనతరం సచివాలయం సెక్రటరీకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు అన్యం రాంబాబు మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికలకు ముందు అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు భూమి ఇస్తామని వాగ్దానం చేశారని ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఏడాది ముగుస్తున్నా ఇంతవరకు వాగ్దానాన్ని అమలు చేయలేదని విమర్శించారు. అలాగే అధికారంలోనికి రాగానే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీ అమలుచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలపై ఎటువంటి భారాలు వేయబోమని, నిత్యావసర ధరలు తగ్గిస్తామని చెప్పి అధికారంలో రాగానే ఆస్తి పన్ను, విద్యుత్‌చార్జీలు పెంచి ప్రజల మీద భారాలు వేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వం తక్షణం హామీలను నెరవేర్చకపోతే ప్రజలు తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, బి వాసుదేవరావు, ఎం వైకుంఠ రావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ కాపులతోనే పతనం


విలేకరులతో మాట్లాడుతున్న నంద్యాల సీతారామయ్య

ఆకివీడు: కాపుల అండదండలతో అధికారాన్ని చేపట్టిన చంద్రబాబు మళ్లీ కాపులతో దోబూచులాడితే పతనం తప్పదని కాపునాడు నియోజకవర్గ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కాపు ఉద్యమంలో రైలు బోగీ తగలబడిన కేసును మళ్లీ రీఓపెన్ చేయాలని జీఓ జారీ చేయడం దారుణమన్నారు. కాపుల్లో వ్యతిరేకత రావడంతో దానిని వెనక్కి తీసుకుని మళ్లీ జీఓ విడుదల చేయడం ఇవి అన్నీ ప్రభుత్వంలో ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు తెలియవా అని సీతారామయ్య ప్రశ్నించారు. జనసేన మద్దతు వల్లే టీడీపీ అధికారాన్ని చేపట్టిన విషయాన్ని మరిచిపోయారని ఎద్దేవా చేశారు. రెడ్ బుక్ పాలనతో ప్రజల్ని హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాపుల జోలికివస్తే కోటలు కూలతాయన్న విషయాన్ని మళ్లీ గుర్తు చేస్తున్నట్లు ఆయన హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కుంకట్ల దానయ్య, తిరుమానేని జగన్ పాల్గొన్నారు.

ఈ బాధలు మాకేంటి బాబూ..?

ఉండి: ఈ బాధలు మాకేంటి బాబూ....చెప్పయ్యా చంద్రబాబూ... అంటూ వృద్ధులు, మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజుల నుండి మండలంలోని ప్రతీ గ్రామంలోనూ మహిళలు, దూరప్రాంతాలలో ఉండే వారంతా రేషన్ దుకాణాల వద్ద చెప్పలేనన్ని ఇబ్బందులు పడుతున్నారు.అంతే కాకుండా దానికి తోడు సర్వర్‌డౌన్ అని ప్రతీరోజు గంటల తరబడి రేషన్‌దుకాణాల వద్ద లబ్ధిదారులు ఎదుచూడాల్సిన పరిస్థితులు తలెత్తాయి. రేషన్‌వాహనాలను రద్దు చేయడం వల్ల వృద్ధులు, రోగులు, నడవలేనిస్థితిలో ఉన్న వారు, చూపు కోల్పోయినవారు ఇలా చాలా మంది ఇప్పుడు రేషన్‌షాపులకు రావాల్సిన దుస్థితి తలెత్తింది. కూటమి ప్రభుత్వం తీసుకున్న రేషన్ వాహనాల రద్దు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి


మంతెన సునీల్ కుమార్

ఆకివీడు: చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన సంఘటన దురదుష్టకరమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మంతెన సునీల్ కుమార్ వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మద్యం, గంజాయి వంటివి విచ్చలవిడిగా లభిస్తున్నాయని, వాటిపై దృష్టి పెట్టి ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాలని సునీల్ విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బూటకపు హామీలతో ప్రజలకు వెన్నుపోటు


కాళ్ల: సమావేశంలో మాట్లాడుతున్న వై.ఈశ్వర ప్రసాద్ రెడ్డి


భీమవరం: వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాళ్ల: అమలు చేయలేమని తెలిసి అధికార దాహంతో బూటకపు హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు నాయుడుకు వెన్నుపోటు దినం కార్యక్రమం ద్వారా గుణపాఠం చెప్పాలని వైఎస్సార్‌సీపీ మేథావుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వై.ఈశ్వర ప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. కాళ్ల మండలం పెదఅమిరం పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 4న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రజలంతా చంద్రబాబు మనస్తత్వం ఏంటో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యక్తిత్వం ఎటువంటిదో తెలుసుకోవాలన్నారు. కేవలం కక్ష్య పూరిత పాలన మాత్రమే రాష్ట్రంలో సాగుతోందని, సంక్షేమం అంటూ ఏపీలో లేదన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చొక్కం సంజీవయ్య, ఎస్‌వీఎస్ రెడ్డి, రాఘవ రెడ్డి, వంగలపూడి జక్కరయ్య, వెలగపల్లి టోనీ, గుర్రం జార్జ్ బెనహర్, పులపర్తి ప్రతాప్, దొంగ దుర్గాప్రసాదరావు, గంగాలు వెంకట మురళి, పండు ఆనంద రవిరాజు, హరిదాసు, రవీంద్రకుమార్ ఎస్ఎస్ ప్రసాద్, చమన సూర్య చంద్రరావు, బొద్దాని శ్రీనువాసు తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం విజయవంతం చేయాలి

భీమవరం: కూటమి పార్టీలు ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలు అమలుచేయకపోవడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని ప్రజలంతా విజయవంతం చేయాలని ఆ పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి ఈద జాషువా కోరారు. మంగళవారం భీమవరంలో ×వెన్నుపోటు ప్రజా వ్యతిరేక కూటమిపై పోరాట దీక్ష కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. , కూటమి పార్టీలు మోస పూరిత వాగ్దానాలతో అందలమెక్కి గతముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలను సైతం విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం బెంహర్, వెలగపల్లి టోనీబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశంచౌక్ సెంటర్ నుంచి ర్యాలీ

భీమవరం: కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన అమలుచేయకుండా ఆరాచకపాలనతో ప్రజలను అణగదొక్కడాన్ని నిరసిస్తూ బుధవారం భీమవరంలో వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు చెప్పారు. కూటమి పాలనలో వైఫల్యాలను ప్రజలకు వివరించడానికి చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమం బుధవారం ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని ప్రకాశంచౌక్ సెంటర్‌లో ప్రారంభమవుతుందన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో ప్రకాశంచౌక్ సెంటర్‌కు చేరుకుని అక్కడి నుంచి తాలూకా ఆఫీస్ సెంటర్ మీదుగా ర్యాలీగా మునిసిపల్ కార్యాలయ ఆవరణలోని ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తామని రామరాజు చెప్పారు.

నేడు ఉండిలో 'వెన్నుపోటు దినం'

ఉండి: మాయమాటలతో ప్రజలను నమ్మించి నట్టేట ముంచి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం వెన్నుపోటు దినాన్ని నిర్వహించేందుకు నియోజకవర్గ ప్రజలంతా తరలిరావాలని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు ఉండి సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వెన్నుపోటుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ర్యాలీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసాపురం పార్లమెంటరీ అబ్జర్వర్ ముదునూరి మురళీకృష్ణంరాజు, నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల హాజరవుతారని తెలిపారు. కాబట్టి నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

మానవత సంస్థకు నూతన కార్యవర్గం ఎన్నిక

ఉండి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉండి శాఖకు నూతన కార్యవర్గం ఏర్పడింది. అధ్యక్షుడిగా డాక్టర్ గాదిరాజు రంగరాజు, కార్యదర్శిగా యర్రా విక్రమ్, కోశాధికారిగా కేటీఎస్ సత్యనారాయణ, డైరెక్టర్లుగా మేష్, శివవర్మ, రావులమ్మ, ఆంజనేయులు, ఏసుబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మానవత విస్తరణ, అభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకీరామరాజు నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, సర్పంచ్ కొండవేటి సాంబశివరాజు మాట్లాడుతూ మానవత సేవాసంస్థ ద్వారా ఎన్నో సేవాకార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.